ఐకేపీ వీవోఏల సమస్యలు

పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా

కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టిన వీవోఏలు

48 గంటల దీక్ష చేపట్టిన వీవోఏలు

నాగర్‌కర్నూల్, నవంబర్ 11: ఐకేపీ వీవో ఏలు సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని ఐకేపీ వీవోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్ ఎదుట 48 గంటల దీక్షను సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనిధి డబ్బులను అధికారులు స్వాహా చేసే పరిస్థితి ఉన్నదని, ఐకేపీ వీవో ఏలకు అందించాల్సిన కమీషన్లను ఉన్న తాధికారులు తీసుకుంటున్నారన్నారు. వీవోఏలకు రూ.20వేల కనీస వేతనం అందించాలని, ఇన్సూరెన్స్ రూ. 20 లక్షలు ఇవ్వాలని దీక్ష చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో రాజకీయ నాయకుల ఒత్తిళ్లను ఆపాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు పని భారం పెంచారని, వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చేపట్టే ఏ సంక్షేమ పథకాన్ని అయినా గ్రామాల్లో సమగ్రంగా ప్రజలకు అందించే వ్యక్తులు మహిళలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధిలోకి తీసుకురావడంలో వీవో ఏలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. గ్రామాల్లో రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో అధికారులు అనేకమంది వీవోఏలను తొలగిస్తున్నారని, ఈ పద్ధతిని మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి సుమలత, గౌరవ అధ్యక్షుడు పర్వతాలు, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గీత, సీఐటీయు జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి రామయ్య, యూనియన్ నాయకులు అంజయ్య, దేవన్న, మల్లేశ్, సుమతి, రామస్వామి, జంగయ్య, జంగమ్మ, వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ సీతారామారావు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

నాగర్‌కర్నూల్, నవంబర్ 11 : కలెక్టరేట్‌కు వచ్చే ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సీతారామారావు జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులతో కలిసి ప్రజల నుంచి అదనపు కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ రోజు ప్రజావాణికి మొత్తం 51 ఫిర్యాదులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి

నాగర్‌కర్నూల్, నవంబర్ 11 : జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సీతారామారావు సూచించారు. నిరక్షరాస్యులను తగ్గించడంతోపాటు ఆధునిక సాంకేతిక అక్షరాస్యత దిశగా ప్రజలను తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రామ్(ఎన్ఐఎల్పీ-ఉల్లాస్) కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమం అమలుపై వివిధ శాఖల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో 27,174 మంది నిరక్షరాస్యులను మొదటి దశలో గుర్తించడం జరిగిందన్నారు. అందులో 10,870 మంది పురుషులు 16,304 మంది మహిళలు నిరక్షరాస్యులుగా ఉన్నారని, వారందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రధాన లక్ష్యంగా కృషి చేయాలని కోరారు. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లను జిల్లా అధికారులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వలంటీర్ల ఎంపిక, తదితర వాటిపై ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

పోలీస్ ప్రజావాణికి ఏడు ఫిర్యాదులు

నాగర్‌కర్నూల్, నవంబర్ 11 : జిల్లా పోలీస్ కార్యాలయానికి సోమవారం ఏడు ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మాట్లాడుతూ.. సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. న్యాయం చేయాలంటూ నాలుగు ఫిర్యాదులు, భూమి పంచాయతీకి సంబంధించి మూడు ఫిర్యాదులు అందాయి. సదరు ఫిర్యాదు దారుల సమస్యలను పరిష్కరించాలని ఆయా ప్రాంతాల పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు.

శబరిమలకు మహాపాదయాత్ర ప్రారంభం

మహాపాదయాత్రలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

అచ్చంపేట టౌన్, నవంబర్ 11 : విజయవంతంగా 9వసారి అయ్యప్ప స్వాములు మహాపాదయాత్రను భక్తిశ్రద్ధలతో సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొన్నారు. అనంతరం పాదయాత్ర స్వాములను సన్మానించి యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, రఘురాం, చంద్రమోహన్ పాల్గొన్నారు.

30మంది మాలధారణ

నాగర్‌కర్నూల్ రూరల్, నవంబర్ 11 : సుదర్శన్ గురు స్వామి ఆధ్వర్యంలో 30మంది ఉమామహేశ్వర క్షేత్రంలో మాలధారణ స్వీకరించారు. కార్యక్రమంలో వెంకటయ్య, గోపి, కొట్ర శేఖర్, శివ, శ్రీధర్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వాముల వనభోజనాలు

దోమలపెంట, నవంబర్ 11 : రాములమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అయ్యప్పస్వాములకు వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఉసిరిచెట్టు కింద అయ్యప్ప మాలధారణ స్వాములకు సోమవారం భిక్ష, సద్ది ఏర్పాటుచేసి పూజలు చేశారు. కార్యక్రమంలో హనుమంతు పాల్గొన్నారు.

కుటుంబాన్ని పరామర్శించిన మున్సిపల్ చైర్మన్

కల్వకుర్తి, నవంబర్ 11 : పట్టణంలో సుభాష్‌నగర్‌కు చెందిన యాదగిరి కుటుంబాన్ని సోమవారం మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం పరామర్శించారు. అనారోగ్యంతో యాదగిరి మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్‌చైర్మన్ బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. అనంతరం దహన ఖర్చుల నిమిత్తం రూ.5వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. ఆయనవెంట వైస్ చైర్మన్ షాహెద్, కౌన్సిలర్లు సూర్యప్రకాశ్‌రావు, మధు, సత్యం, ఖాదర్, కిరణ్, నిజాం, గణేశ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతుకుటుంబానికి న్యాయం చేయాలి

వెల్దండ. నవంబర్ 11 : మండలంలోని ఎంజీతండాలో ఇటీవల హత్యకు గురైన రాజు కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి అన్న, ఎంజీ తండా మాజీసర్పంచ్ శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం వెల్దండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన రాజు కుటుంబ సభ్యులు న్యాయం చేయాలని ఎస్సై కురుమూర్తిని కోరారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. విచారణ చేస్తున్నాం న్యాయం జరిగేలా చూస్తామని పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే సహకారంతోనే గ్రామాభివృద్ధి

దోమలపెంట, నవంబర్ 11: ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రత్యేక చొరవతో దోమలపెంట, ఈగలపెంట, పాతాళగంగ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఖాజా మోయిజుద్దీన్, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున్‌రావు అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. దోమలపెంట ఎస్టీ కాలనీ వరకు విద్యుత్‌లైన్ ఏర్పాటుకు మార్గం సుగమమైందన్నారు. సమావేశంలో గురువయ్యా, వెంకటరంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈతచెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కల్వకుర్తి రూరల్, నవంబర్ 11 : తర్నికల్ గ్రామంలో జాగీర్‌దారుల పొలాల్లో తాటి, ఈత చెట్లను తొలగించిన వారిపైన చర్యలు తీసుకోవాలని గ్రామ గీతకార్మికులు సోమవారం ఎక్సైజ్ ఎస్సైకి వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్నో ఏండ్లుగా గ్రామంలో కల్లు గీత కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్నామన్నారు. చెట్లను తొలగించడం ద్వారా తమకు ఉపాధి లేకుండా పోతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గీత కార్మికులు, గ్రామస్తులు ఉన్నారు.

సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

కల్వకుర్తి రూరల్, నవంబర్ 11 : ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ చక్కగా చదువుకోవాలని ఏటీడీవో, ఇన్‌చార్జి ఏపీవో యాదమ్మ సూచించారు. సోమవారం పట్టణంలోని బీఏఎస్ స్కీం ఉన్న వీబీస్ హైస్కూల్‌ను ఆమె సందర్శించారు. కార్యక్రమంలో వీబీస్ పాఠశాల కరెస్పాండెంట్ రాజు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

10శాతం రాయితీతో అద్దెకు ఆర్టీసీబస్సు

అచ్చంపేట టౌన్, నవంబర్ 11 : అచ్చంపేట డిపో పరిధిలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు రాయితీతో అద్దెకు బస్సులను అందజేస్తున్నట్లు డిపో మేనేజర్ పీఎండీ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14వ తేదీన చిల్డ్రన్స్‌డే సందర్భంగా విద్యార్థులను విహార యాత్రకు, దేవస్థానాలకు తీసుకెళ్లే సందర్భంగా ఆర్టీసీ 10శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు.

పెంట్లవెల్లి సొసైటీ రైతులకు రుణమాఫీ చేయాలి

కొల్లాపూర్ రూరల్, నవంబర్ 11 : మండల కేంద్రంలోని సొసైటీలో క్రాప్‌లోన్ తీసుకున్న 499మంది రైతులకు రుణమాఫీ చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

పొగాకు అనర్థాలపై అవగాహన

పొగాకు నివారణపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

బిజినేపల్లి, నవంబర్ 11 : బిజినేపల్లిలో ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు కళా జాత బృందంచే పొగాకు వాడకం వల్ల వచ్చే అనర్థాలను ప్రజలకు అవగాహన కల్పించారు. జాతీయ పొగాకు నివారణ కార్యక్రమంలో భాగంగా యువత జర్ద, పాను, మసాలా, గుట్కా, కొకైన్, పొగ తాగడం, డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో రమేష్‌కుమార్, తామర, అశోక్, గంగా, కళాజాత బృందాల సభ్యులు పాల్గొన్నారు.

న్యాయసేవ సలహాలను సద్వినియోగం చేసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రాజేశ్‌బాబు

- జిల్లా న్యాయమూర్తి రాజేశ్‌బాబు

నాగర్‌కర్నూల్, నవంబర్ 11 : ప్రజలకు ఉచిత న్యాయ సలహాయం, సేవలు అందించేమే న్యాయ సేవా సంస్థ ధ్యేయమని, ఈ న్యాయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ రాజేశ్‌బాబు విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో జాతీయన్యాయ సేవల దినోత్సవం సందర్భంగా స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో కలిసి న్యాయ సేవల విని యోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయం అందరికీ సమానమని, ధనిక, పేద, కులం, మతం అనే తేడాలు లేవని తెలిపారు. సీనియర్ సివిల్‌జడ్జి లీగల్ అథారిటీసెల్ సెక్రటరీ సబిత మాట్లాడుతూ.. ప్రజలకు ఉచిత న్యాయసేవలు అందించడం, సంక్షేమ చట్టాలను తెలియజేయడం, లోక్ అదాలత్ ద్వారా ప్రజలకు సత్వరన్యాయం అందించడం, నాల్సా చట్టం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

- అట్టహాసంగా ప్రారంభమైన గురుకుల జోనల్ స్థాయి క్రీడలు
- ఆకట్టుకున్న పోటీలు - క్రీడల్లో పాల్గొన్న 1105మంది విద్యార్థులు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

లింగాల, నవంబర్ 11 : విద్యార్థులు క్రీడలతో నాయకత్వ లక్షణాలను అలవర్చుకొని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో నాలుగురోజులపాటు నిర్వహించే 10వ జోనల్ స్థాయి క్రీడలను సోమవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గురుకుల పాఠశాలలపట్ల అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తును కోసం సకల వసతుల తోపాటు కార్పొరేట్ తరహాలో విద్య బోధనకు అందిస్తుందన్నారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని చదువుల్లో రాణించాలన్నారు. జోనల్ స్థాయి క్రీడల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 13గురుకుల పాఠశాలల నుంచి 1105మంది విద్యార్థులు, 26మంది పీడీలు, పీఈటీలు పాల్గొనగా కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాల స్వామి, పీడీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల కమిటీ ఎన్నిక

కల్వకుర్తి రూరల్, నవంబర్11 : జిల్లా కేంద్రంలో సోమవారం కల్వకుర్తి సబ్ డివిజన్ విద్యుత్ ఉద్యోగుల నూతన కమిటీని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్ పలు యూనాయకుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కల్వకుర్తి సబ్‌డివిజన్ విద్యుత్ ఉద్యోగుల 327 యూనియన్ అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా వరప్ర సాద్, కోశాధికారిగా కేశవులు, వర్కింగ్ ప్రసిడెంట్‌గా స్వాతిలను ఏకగ్రీవంగా ఎన్నుకుని వారిని అభినందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లక్ష్మయ్య, శ్రీనివాసులు, శ్రీధర్, శ్రీనివాస రాజు, రాఘవేందర్‌లు ఉన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

చార కొండ, నవంబర్ 11 : మండల కేంద్రానికి చెందిన చింతపల్లి నిర్మలమ్మపై అకారణంగా దాడి చేసి గాయపరిచిన అదే గ్రామానికి చెందిన కాటమయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంషొద్దీన్ తెలిపారు. ఆదివారం నిర్మలమ్మ తమ పొలానికి వెళ్లగా అక్కడ బావ కుమారుడు కాటమయ్య అకారణంగా దూషించి, తాటిమట్టతో కొట్టి గాయపర్చినట్లు బాధితురాలు సోమవారం ఫిర్యాదులో పేర్కొనట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నాగర్‌కర్నూల్, నవంబర్ 11 : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన తెలకపల్లి మండలం ఆలేరులో సోమవారం చోటు చేసుకున్నది. ఎస్సై నరేశ్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఆలేరుకు చెందిన బీరగాళ్లరాము, పుష్పలత భార్యాభర్తలు. ఇద్దరు ఈనెల 10న వారి ద్విచక్ర వాహనంపై జిల్లా కేంద్రానికి సొంత పనిపై వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో కమ్మ డ్డెపల్లి గేటు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో పుష్పలతలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, భర్త రాము తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి మరిది బీరగాళ్ల మల్లయ్య సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పదోతరగతి పరీక్ష రుసుము గడువులోగా చెల్లించాలి

నాగర్‌కర్నూల్ రూరల్, నవంబర్ 11 : పదోతరగతి పరీక్ష రుసుం చెల్లింపు తేదీలను ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు వెల్లడించిన వివరాల ప్రకారం పరీక్షల రుసుము చెల్లింపు విషయంలో హెచ్ఎం ప్రత్యేకశ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి గోవిందరాజులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఈ నెల 18 వరకు చెల్లించుకునేందుకు గడువు ఇచ్చారని తెలిపారు. ఆ తర్వాత రూ.50 ఆలస్య రుసుముతో డిసెంబరు 2వరకు చెల్లించేందుకు అవకాశం కల్పించారని రూ.200 ఆలస్యం రుసుముతో డిసెంబర్ 12వరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబర్ 21వరకు చెల్లించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

శ్రీశైలంలో భక్తుల సందడి

కార్తీకమాసం సందర్భంగా వేలాదిగా భక్తులు

శ్రీశైలం, నవంబర్ 11 : శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్ల మహా పుణ్య క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతుంది. కార్తీక మాసం రెండవ సోమవారం తెలుగురాష్ట్రాల నుంచే కాక ఉత్తర దక్షిణాది రాష్ట్రాల నుండి వచ్చిన యాత్రికులు తెల్లవారు జాము నుంచి క్యూలైన్లలో బారులుదీరారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న కారణంగా శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టిందని అధికారులు తెలిపారు. సాయంకాలం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పుష్కరిణి వద్ద ప్రత్యేక పుష్పాలంకరణతో పూజలు నిర్వహించారమని ఈవో చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో అర్చకులు వీరన్న, మార్కం దేవుళ్ళు అధికారులు ఈఈ నర్సింహారెడ్డి, పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

నిత్యాన్నదాన పథకానికి రంగారెడ్డి జిల్లాకి చెందిన నిరంజన్ రావు (రూ1,00,100) విరాళాన్ని ఇచ్చారు. సోమవారం ఆలయ పర్యవేక్షకురాలు హిమబిందుకు విరాళాన్ని చెక్కు రూపంలో అందించారు దాతలకు శ్రీభ్రమరాంబికా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనాన్ని కల్పించి ప్రత్యేక పూజలు చేయించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

బిజినేపల్లి, నవంబర్ 11 : మండలంలోని పాలెం గ్రామంలో వెంకన్నస్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్తీక సోమవారం దశమి సందర్భంగా వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా అర్చకుల వేదమంత్రోచ్చరణ మధ్య నిర్వహించారు. అనంతరం భక్తులకు తలంబ్రాలను పంపిణీ చేశారు. అదేవిధంగా అన్నప్రసాదాల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో రామానుజాచార్యులు, జయంత్, చక్రపాణి, సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పీఏసీసీఎస్ సీఈవో సస్పెండ్‌కు తీర్మానం

సీఈవో సస్పెండ్‌కు సమావేశం అయిన విండో పాలకవర్గం

తిమ్మాజిపేట, నవంబర్ 11 : మండల కేంద్రంలో గొరిట ప్రాథమిక సహకార సంఘం సీఈవో నరేశ్ సస్పెండ్‌కు పాలకవర్గం తీర్మానం అమోదించింది. మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో సోమవారం అధ్యక్షుడు రఘునందర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం అయిన సభ్యులు ఈ మేరకు తీర్మానం ఆమోదించినట్లు ఉపాధ్యక్షుడు రాందేవ్‌రెడ్డి తెలిపారు. తీర్మానంపై 8మంది సంతకాలు చేసినట్లు ఆయన తెలిపారు. దీనిని డీసీవో కార్యాలయానికి పంపుతున్నట్లు తెలిపారు. కార్యాలయం నుంచి వచ్చిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ అంజమ్మ, మరో అధికారి గణేశ్ సమక్షంలో ఈ తీర్మానం చేశారు. సొసైటీలో గత కొంత కాలంగా నిధుల దుర్వినియోగంపై విచారణ జరుగుతుంది. ఈ నేపథ్యంలో సీఈవో సస్పెండ్‌కు తీర్మానం చేశారు. కాగా కొత్త సీఈవోగా కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీనివాసులుయాదవ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇదిలా ఉండగా, ఇటీవల విండో అధ్యక్షుడిపై అవిశ్వాసం పెట్టిన సభ్యులలో కొందరు సీఈవో సస్పెండ్ చేయాలన్న తీర్మానంపై సంతకాలు చేయడం గమనార్హం.

మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట

కల్వకుర్తిలో మాట్లాడుతున్న మున్సిపల్‌చైర్మన్ ఎడ్మసత్యం

అచ్చంపేట, నవంబర్ 11 : గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం వారి సంక్షేమం కోసం కట్టుబడి ఉందని, విద్యా ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం అచ్చంపేటలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో మౌలానా అబుల్‌కలాం జయంతిని జరుపుకొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాయ చైర్మన్ రాజేందర్, మార్కెట్ చైర్‌పర్సన్ రజిత మల్లేశ్, ప్రిన్సిపాల్ యాదగిరి, కోఆర్డినేటర్ చంద్రశేఖర్, వార్డెన్ కరీం, పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అబుల్‌కలాం కృషి

కల్వకుర్తిరూరల్, నవంబర్11 : పట్టణంలో అబుల్‌కలాం అజాద్ జయంతి ఘనంగానిర్వహించారు. సోమవారం కల్వకుర్తి పట్టణంలోని మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో మున్సిపల్‌చైర్మన్ ఎడ్మసత్యం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్మయి, మైనారిటీ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రకళ ము న్సిపల్ వైస్‌చైర్మన్ షాహెద్, కౌన్సిలర్లు తాహేర్‌అలి, గోరటిశ్రీను, మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్ ఉన్నారు.

కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్ రూరల్, నవంబర్ 11 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ అబుల్‌కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, వైస్‌ప్రిన్సిపాల్ స్వర్ణలత, వైస్‌ప్రిన్సిపాల్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

రైతు సంక్షేమమే ధ్యేయం

పెంట్లవెల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్, నవంబర్ 11 : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని పల్కపల్లిలో పీఏసీసీఎస్ సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ చైర్మన్ రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి చంద్రవతి, నర్సయ్యయాదవ్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఊర్కొండలో..

ఊర్కొండ, నవంబర్ 11 : మండలంలోని బొమ్మరాజుపల్లిలో సోమవారం గ్రామమహిళా సమాఖ్య ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీవో క్రిష్ణయ్య చేతులమీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీ సునీల్‌కుమార్‌రెడ్డి, వీవోఏ ఆంజనేయులుగౌడ్, తిరుపత్‌రెడ్డి, చంద్రకళ, అరుణ, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లిలో..

పెంట్లవెల్లి, నవంబర్ 11 : మండలంలోని జటప్రోల్, గోప్లాపురం గ్రామాలతో పాటు మండల కేంద్రంలో సోమవారం మహిళాసమాఖ్య ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం గౌస్ మాట్లాడుతూ.. ఏగ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,320, సాధారణ రకం క్వింటాకు రూ. 2,300 ప్రకారం కొనుగోలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ గోవిందుగౌడ్, మాజీ వైస్‌ఎంపీపీ భీంరెడ్డి, మాజీవిండో చైర్మన్ రామకృష్ణగౌడ్, నాయకులు నాగిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కురుమయ్య, మధుగుం నరసింహ, బాలరాజు తదితరులు ఉన్నారు.

బావాజీపల్లిలో..

తిమ్మాజిపేట, నవంబర్ 11 : మండలంలోని బావాజీపల్లిలో మహిళ సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఏపీఎం శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.